క్లుప్తంగా

మామిడి మొక్కలు నాటాలి

చౌడేపల్లి: ఉపాధి హామీ పథకంలో మామిడి తోటల పెంపకం పనులకు గుంతలు తీసిన రైతులు నెలాఖరు లోపు మొక్కలు నాటాలని ఏపీఓ శ్రీనివాస్ యాదవ్ కోరారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఆయన సమీక్షించారు. మండలంలో 450 ఎకరాల్లో మామిడి తోటల పెంపకం పనులు చేస్తున్నట్టు చెప్పారు. ఇంకనూ గుంతలు తీయని రైతులు పనులకు ఉపక్రమించాలని, నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని సిబ్బందికి ఆదేశించారు. సమావేశంలో జేఈ ధనుంజయుడు, సీఓలు ప్రసాద్, భరత్ పాల్గొన్నారు.

సంఘాల ఆర్థిక నిర్వహణపై శిక్షణ



అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీనివాసులు

గుడుపల్లి: వైఎస్ఆర్ క్రాంతి పథం మహిళా సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందే దిశగా దృష్టి సారించాలని ఏపీఎం శ్రీనివాసులు అన్నారు. సంఘాల ఆర్థిక నిర్వహణపై రెండు రోజులు శిక్షణ కార్యక్రమం బుధవారం స్థానిక శ్రీశక్తి భవనంలో మొదలైంది. గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు ఆర్థిక లావాదేవీలపై అవగాహన కల్పించారు. మండల సమైఖ్యకు ప్రతి గ్రామ సమైఖ్య సభ్యులు నెల నెలా పొదుపు చేసి రుణాలు పొందాలన్నారు. అన్ని సంఘాలు ఆర్థికంగా బలపడితేనే బ్యాంకు రుణాలు విరివిగా పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీసీలు, సంఘాల సభ్యులు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

పంటలపై 'గజ'దాడులు

వి.కోట: మండలంలో తరచూ గజరాజుల దాడులతో రైతులు పంటలు నష్టపోతున్నారు. బుధవారం మండలంలోని చిన్నశ్యామ గ్రామంలో అరటి తోటను ఏనుగులు తొక్కినాశనం చేశాయి. దీంతో బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

పేదల ముఖాల్లో చిరునవ్వే లక్ష్యం : ఎమ్మెల్యే



సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే

పెద్దపంజాణి: పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలన్నదే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ వెంకటేగౌడ అన్నారు. బుధవారం మండలంలోని మిట్టపల్లె, కరసనపల్లె, కమ్మినాయునిపల్లె, రాజుపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. 822 గృహాలను సందర్శించారు. నాలుగేళ్లలో ప్రభుత్వ పథకాల రూపేణా ఆయా కుటుంబాలు పొందిన లబ్ధిని బుక్‌లెట్లతో వివరించారు. మిట్టపల్లెలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, కరసనపల్లె ఎస్సీ కాలనీ, రాజుపల్లెలో మురుగునీటి కాలువలు నిర్మించాలని గ్రామస్తులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డెప్ప, జెడ్పీటీసీ సుష్మకీర్తి, పెద్దపంజాణి మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బాగారెడ్డి, వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ పృథ్వి, ఎంపీడీఓ భాస్కర్, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్రబల్లి శ్రీనివాసులు, సురేష్, సర్పంచులు శిరీష, నర్మద, ఎంపీటీసీ మునీశ్వరి, మాజీ సర్పంచ్ మణి, నాయకులు నాగశంకర్ రెడ్డి, క్రిష్టప్ప, శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గురుకుల పాఠశాల తనిఖీ

రొంపిచెర్ల: విద్యార్థులకు ఇస్తున్న కోడి గుడ్డు, అరటి పండ్లు సైజు పెంచాలని ఎస్ఎస్ఏ పీఓ వెంకటరమణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక కస్తూర్బా గురుకుల పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. అలాగే స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో రొంపిచెర్ల, పులిచెర్ల మండలాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను, అనంతరం బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఎంఈఓ శ్రీనివాసులు, కేజీబీవీ ఎస్ఓ సుజాత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ హాస్టల్‌లో సమావేశం

పలమనేరు: పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో బుధవారం ఎంపీపీ రోజా అధ్యక్షతన వసతి గృహాల సలహా సంఘ సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ కుప్పుస్వామి మాట్లాడారు. అధికారులు, తల్లిదండ్రుల సలహాలు–సూచనలు స్వీకరించారు. పలు శాఖల అధికారులు, హాస్టల్ వార్డెన్లు పాల్గొన్నారు.

ఎస్ఐగా శ్రీనివాస్

రామకుప్పం: ఎస్ఐగా శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న కృష్ణయ్య రొంపిచెర్లకు బదిలీ అయ్యారు.

బోడిపాటివారిపల్లెలో 'పొలంబడి'

రొంపిచెర్ల: మండలంలోని బోడిపాటివారిపల్లెలో బుధవారం మండల వ్యవసాయాధికారిణి సుధారాణి వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు వేరుశనగ పంట సాగుపై అవగాహన కల్పించారు. ఆర్‌బీకే ఇన్‌చార్జి వెంకటరమణ నాయక్, రైతులు పాల్గొన్నారు.

నేడు చెరువుల వేలం

చౌడేపల్లి: మండలంలోని శెట్టిపేట పంచాయతీ పరిధిలోని మూడు చెరువులను చేపల పెంపకానికి గురువారం వేలం వేయనున్నట్టు సర్పంచ్ ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు శెట్టిపేట చెరువు, బుడమల కుంట, జ్ఞానాంబిక చెరువులను వేలం వేస్తామని, ఆసక్తి కలిగిన వారు రూ.5 వేలు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

జనానికి భరోసా...క్యాడర్‌కు ఉత్తేజం

- 11 రోజుల్లో 4 మండలాలు, మున్సిపాలిటీలో పర్యటించిన మంత్రి



జరుగు గ్రామంలో వర్షంలో గొడుగుల నీడలో ప్రసంగిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి

శాంతిపురం: కుప్పంపై ప్రత్యేకంగా దృష్టి సారించిన రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ వనరుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గవ్యాప్తంగా విస్తృతంగా పర్యటించారు. నియోజకవర్గంలో మంత్రి పల్లెబాట, వార్డు బాట కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయి. బుధవారం కూడా వరుణుడు మంత్రి కార్యక్రమాలను చిరుజల్లులతో ఆశీర్వదించాడు. ప్రజల సమస్యలను సావధానంగా ఆలకిస్తూ, వారిలో కొండంత ధైర్యాన్ని ఆయన నింపారు. ఏ కష్టం వచ్చినా తాను, ఎమ్మెల్సీ భరత్, ఎంపీ రెడ్డెప్ప అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలో ప్రజలు పొందుతున్న లబ్ధిని, గతంలో చంద్రబాబు పాలనలో ఎంత దగా చేశారో సభల్లో మంత్రి విపులీకరించారు. టీడీపీ నాయకులకు భయపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి, అందుబాటులో ఉన్న భరత్‌ను ఎమ్మెల్యేగా, రెడ్డెప్పను ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఎన్నికల నగారాను మోగించారు. పచ్చ పార్టీ దౌర్జన్యాల నుంచి రక్షించేందుకు తాను, తమ పార్టీ క్యాడర్ ఉందని స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యేగా ఉన్న చంద్రబాబు చుట్టపు చూపుగా కుప్పానికి వచ్చి కొన్ని ప్రాంతాలు, కొందరు వ్యక్తులకే పరిమితం అవుతున్న నేపథ్యంలో ఆయన అందుబాటులో ఉండరనే విషయం జనంలోకి తీసుకువెళ్లారు. కరోనా కష్టకాలంలో చంద్రబాబు, ఆయన కుమారుడు హైదరాబాద్‌కే పరిమితమైతే ఎమ్మెల్సీ భరత్ కుప్పం ప్రజల వెన్నంటే ఉంటూ సేవలు చేశారని గుర్తు చేశారు.

క్యాడర్‌లో జోష్

మరో 9 నెలల్లోపు జమిలి ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో మంత్రి నియోజకవర్గ పర్యటన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. చంద్రబాబు లాంటి బలమైన నాయకుడిని ఎదుర్కోవడానికి కావాల్సిన నైతిక స్థైర్యాన్ని మంత్రి నింపారని, ఏకతాటిపై నిలిచి ప్రత్యర్థితో పోరాడేలా దిశానిర్దేశం చేశారని పార్టీ క్యాడర్ సరికొత్త జోష్‌తో ఉంటోంది. కుప్పంలో భరత్‌ను గెలిపిస్తే మంత్రివర్గంలోకి తీసుకుంటామనే సీఎం హామీని పదే పదే గుర్తు చేయటం ద్వారా ఎమ్మెల్యే ఎన్నికలు ఎంత కీలకమో తేల్చి చెప్పారు. మరో వైపు టీడీపీ శ్రేణులను ఆత్మరక్షణలోకి నెట్టారు. స్థానిక నాయకుల పట్ల తెలుగు తమ్ముళ్లలోని ఓ వర్గం అసంతృప్తిగా ఉండడాన్ని ఆసరాగా చేసుకుని చంద్రబాబు తన సామాజిక వర్గానికి చెందిన ప్రకాశం జిల్లా వ్యక్తి చేతిలో కుప్పం పార్టీ బాధ్యతలు పెట్టడాన్ని పచ్చ తమ్ముళ్లు, కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారు. నాలుగు దశాబ్దాలుగా పార్టీకి ఊడిగం చేస్తున్నా తమను నమ్మక, బీసీలు ఎక్కువగా ఉన్న ప్రాంతంపై బాబు సొంత సామాజిక వర్గం వారిని రుద్దుతున్నారని ప్రైవేటు సంభాషణల్లో ఆ పార్టీ నాయకులు కారాలు మిరియాలు నూరుతున్నారు. నియోజకవర్గంలో ఉన్న మొత్తం ఓట్లు, పోలయ్యే ఓట్లు, సైకిల్‌కు వచ్చే ఓట్లతో సంబంధం లేకుండా 'లక్ష లక్ష్యం' ఏమిటని పెదవి విరుస్తున్నారు. ఈ పరిమాణాల నేపథ్యంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కనుసన్నల్లో వైఎస్ఆర్‌సీపీ శ్రేణులు పోరాటానికి సిద్ధం కావడం టీడీపీ క్యాడర్‌లో ఆందోళన పెంచుతోంది.

అప్పటికప్పుడే 'రైట్..రైట్!'

ప్రజలు, స్థానిక నాయకులు తన దృష్టికి తెచ్చిన సమస్యలపై మంత్రి పెద్దిరెడ్డి స్పందించారు. తమ రూట్లో వస్తున్న ఆర్టీసి బస్సును గత టీడీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో అగచాట్లు పడుతున్నామని 121 పెద్దూరులో స్థానికులు నివేదించడంతో..ఆయన గంటల వ్యవధిలోనే ఈ మార్గంలో బస్సు సర్వీసును ప్రారంభించి ప్రజలను ఆశ్చర్యచకితుల్ని చేశారు. ఇక, కుప్పం పట్టణం 9వ వార్డులో తాగునీటి బోరు, మురుగు కాలువలు అప్పటికప్పుడే మంజూరు చేశారు. అలాగే మఠంలో ఆలయ పునర్నిర్మాణానికి ఆదేశించారు. గ్రామ, వ్యక్తిగత సమస్యలపై వచ్చిన వినతుల సత్వర పరిష్కారానికి అధికారులకు మార్గదర్శనం చేశారు.

ఆలోచించి ..అదరించండి

కుప్పం: గతంలో చంద్రబాబు పాలన....ఇప్పుడు జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనను బేరీజు వేసుకుని వైఎస్సార్ సీపీని ఆదరించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మరోసారి ప్రజలను కోరారు. బుధవారం వెండుగంపల్లె, నడుమూరు, వసనాడు, మంకలదొడ్డి, మల్లానూరు, టీ.సదుమూరు, మెట్లచేను, పైపాళ్యం పంచాయతీలలో మంత్రి 'పల్లెబాట' నిర్వహించారు. జగన్‌మోహన్ రెడ్డి నవరత్న పథకాలతో ప్రతి ఇంటికీ లబ్ధి చేకూరిందా, లేదా? అని ఆలోచించాలన్నారు. పెద్దలు పిల్లలకు ఇవ్వాల్సి ఆస్తి చదువని నమ్మి సీఎం ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మార్చేశారని పలు పథకాలను ప్రస్తావించారు.

దొంగ ఓట్లతో కాదు..ప్రజాబలంతో గెలవాలి

ప్రజా బలంతో గెలుపొందాలేగానీ దొంగ ఓట్లతో కాదని చంద్రబాబునాయుడును ఉద్దేశించి మంత్రి వ్యంగ్యాస్త్రాలు సంధించారు. టీడీపీ దొంగఓట్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే, కుప్పం నియోజకవర్గంలో 38 వేల దొంగ ఓట్లు బయట పడ్డాయని, వీటిలో 12 వేల ఓట్లను ఏరివేశారని, మిగిలివి ఇంకా ఉన్నాయని, వాటినీ గుర్తించి తొలగిస్తామన్నారు. చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, టీటీడీ పాలక మండలి సభ్యులు పోకల అశోక్ కుమార్, నియోజకవర్గ పరిశీలకులు మొగశాల రెడ్డెప్ప, కుప్పం మున్సిపాలిటీ పరిశీలకులు నరేష్‌కుమార్ రెడ్డి , రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ సుధీర్, ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వనిత, ఎంపీపీ అశ్విని, జెడ్పీటీసీ శరవణ, మండల కన్వీనర్ మురుగేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి మంత్రి 'వార్డుబాట'

పుంగనూరు: పుంగనూరు ఎమ్మెల్యే, రాష్ట్ర విద్యుత్, అటవీ, పర్యావరణ, గనులశాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నిత్యం ప్రజల్లో మమేకమవుతూ, వారి సమస్యల పరిష్కారానికి ఏటా రెండు సార్లు 'పల్లెబాట' నిర్వహించడం పరిపాటి. ప్రతి ఇంటికీ వెళ్లి పలకరించడం ఆనవాయితీ. అయ్యప్ప మాల ధరించి ఆయన ఈ కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకత! గురువారం నుంచి ఆయన పుంగనూరు మున్సిపాలిటీలో ఐదురోజుల పాటు వార్డు బాట నిర్వహించనున్నారు.

పర్యటన ఇలా....

27న హనుమంతరాయునిదిన్నె నుంచి వార్డుబాట ప్రారంభించి 19, 20, 26, 27, 28, 29 వార్డులలో పర్యటిస్తారు. రోజుకు ఆరు వార్డుల చొప్పున ఐదు రోజుల్లో 31 వార్డులు పర్యటించనున్నారు. మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి, చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ప్రారంభోత్సవాలు

వార్డు బాటలో సుమారు రూ.2 కోట్లతో చేపట్టనున్న కాలువలు, వీధుల పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు మంత్రి చేయనున్నారు. పట్టణంలోని హిదయత్‌నగర్‌లో రూ.17.20 లక్షలతో వేసిన రోడ్డు, వివేకానంద కాలనీలో రూ.20లక్షలతో నిర్మించిన కాలువను, అలాగే రూ.20లక్షలతో నిర్మించిన ఆర్‌ఓఆర్ ప్లాంట్లను మంత్రి ప్రారంభిస్తారు.

మండల పర్యటన

వార్డుబాట అనంతరం ఆగస్టు 2వ తేదీ నుంచి నియోజకవర్గంలోని ఒకొక్క మండలంలో ఐదు రోజుల పాటు పర్యటిస్తారు. అయ్యప్పదీక్ష ముగిసే సరికి పల్లెబాట పూర్తి చేస్తారు.

సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు పరిశీలన



సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న ఓఎస్‌డి విజయభాస్కర్‌రెడ్డి, నాగభూషణం

పుంగనూరు: పుంగనూరు మున్సిపాలిటీలో విద్యుత్ ఆదా చేసే దిశగా దృష్టి సారించారు. సోలార్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడానికి బుధవారం ట్రాన్స్‌కో ఓఎస్‌డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డితో కలసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలించారు. ట్యాంకు వద్ద సోలార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయాలని మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిధున్‌రెడ్డి ఆదేశించిన నేపథ్యంలోఇక్కడ పరిశీలన చేసినట్లు ఓఎస్‌డి తెలిపారు. కార్యక్రమంలో పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, కౌన్సిలర్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పెద్దిరెడ్డి

చౌడేపల్లె : మండలంలో గడ్డంవారిపల్లె సమీపంలోని శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయం వద్ద కమ్యూనిటీ భవన నిర్మాణానికి బుధవారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి భూమి పూజ చేశారు. దీని నిర్మాణానికి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల చొరవతో రూ.45 లక్షలు మంజూరు చేశారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ రామ్మూర్తి, మాజీ ఎంపీపీ రుక్మిణమ్మ, సర్పంచ్ భాగ్యవతి, ఎంపీటీసీ శ్రీరాములు, పీఆర్ డీఈఈ ప్రసాద్, నేతలు మోహన్ రెడ్డి, ఓబుల్‌రెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గిరిబాబు, సుబ్బారెడ్డి, పెద్దన్న, బాబు, సురేంద్రరెడ్డి, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవనోపాధి కల్పిస్తాం



స్వయం సహాయక సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడి తులసి

చౌడేపల్లె: స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెరుగైన జీవనోపాధి కల్పించి, వారిని ప్రోత్సహించడమే ధ్యేయమని డీఆర్‌డీఏ పీడి తులసి స్పష్టం చేశారు. బుధవారం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో మహిళలకు (మినిస్ట్రీ ఆఫ్ స్మాల్ స్కేల్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్) సహకారంతో అవగాహన సదస్సు నిర్వహించారు. చెరుకు పంట సాగు చేయడం, చింత పండు, తేనె సేకరణతోపాటు వివిధ రకాల పనులు చేసే వారికి రుణాలివ్వడంతో పాటు మార్కెటింగ్ సేవలపై ప్రోత్సహిస్తామన్నారు. అలాంటి సభ్యులందరినీ ఒక సంఘంగా ఏర్పాటు చేసి, కాల్ ఫెసిలిటేషన్ సెంటర్ ఏర్పాటు చేసి, మెరుగైన జీవనోపాధులు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ కుమార్,సెర్ప్ అధికారులు విజయ్‌కుమార్, వెంకటేష్, సూరి, హరి, శివ, సర్వోత్తమరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమల : మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ కుమార్

ఎంఎస్ఎంఈపై అవగాహన

సోమల: స్థానిక వెలుగు సమాఖ్య కార్యాలయంలో బుధవారం సదుం, సోమల, చౌడేపల్లె మండల సమాఖ్య పరిధిలో ఎంఎస్ఎంఈ (మినిస్ట్రీ ఆఫ్ స్మాల్ స్కేల్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్)పై ఆ సంస్థ అడిషనల్ డైరెక్టర్ కుమార్, ఏపీఎం శివయ్య అధ్యక్షతన డ్వాక్రా సభ్యులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెర్ప్ అధికారులు విజయ్ కుమార్, వెంకటేష్, ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, ఎంపీడీఓ నాగరాజ, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, మాజీ ఎంపీటీసీ రమణయ్య, మండల సమాఖ్య కార్యదర్శి గౌరి, సంఘమిత్రలు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్న సురక్ష'



సదుం: ఎర్రాతివారిపల్లెలో..

పుంగనూరు: మండలంలోని సింగిరిగుంటలో నిర్వహించిన సురక్ష గ్రామసభలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పికెఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి పలువురికి ధ్రువపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సీతారామన్, సర్పంచ్ ఆంజప్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రారెడ్డి యాదవ్, జయరామిరెడ్డి, ఆంటోని, మోహన్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

562 మందికి ధ్రువపత్రాల పంపిణీ...

సోమల: మండలంలోని దిడ్డివారిపల్లె సచివాలయ పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో 562 మందికి వివిధ ధ్రువ పత్రాలను ఎంపీపీ ఈశ్వరయ్య, సర్పంచ్ రాజేశ్వరి, ప్రజాప్రతినిధులు పంపిణీ చేసి మాట్లాడారు.ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్,నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా,ఉప సర్పంచ్ వసంతమ్మ,జేసీఎస్ మండల కన్వీనర్ రాశెట్టి మధు, అధికారులు పాల్గొన్నారు.

కాటిపేరిలో 102 మందికి..

చౌడేపల్లె: కాటిపేరి గ్రామసచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామసభలో 102 మందికి వివిధ ధ్రువపత్రాలను అందజేసినట్లు స్పెషలాఫీసర్ ప్రసాద్ తెలిపారు. సర్పంచ్ సరితారెడ్డి, ఎంపీటీసీ జ్యోతమ్మ, తహసీల్దార్ మాధవరాజు తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు : టీడీపీ నాయకురాలికి సర్టిఫికెట్‌ను ఇస్తున్న కౌన్సిలర్ నాగరాజు, అధికారులు

ఎర్రాతివారిపల్లెలో 233 మందికి..

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లెలో నిర్వహించిన జగనన్న సురక్షలో 233 మందికి వివిధ ధ్రువపత్రాలను జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప పంపిణీ చేశారు. సర్పంచులు కళావతి, ఎల్లప్ప, ఎంపీటీసీ సభ్యురాలు శ్రీలత, ఎంపీడీఓ వరప్రసాద్, ఏఎంసీ వైస్ చైర్మన్ శివారెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

9వ వార్డులో 372మందికి..

పలమనేరు: స్థానిక తొమ్మిదో వార్డులో ఆ వార్డు కౌన్సిలర్ నాగరాజు, టీడీపీ మహిళా విభాగం క్రియాశీలక నాయకురాలు ప్రమీలకు కుల, ఆదాయ ధ్రువీకరణ సర్టిఫికెట్‌ను అందజేశారు. వార్డులో 372మందికి అవసరమైన సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

పెద్దపంజాణి మండలంలో..

పెద్దపంజాణి: రాయలపేట, శంకర్రాయలపేట సచివాలయాలలో నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో 514 మందికి కులం, 529 మందికి ఆదాయం, 3 ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, 11 ఆధార్ మొబైల్ లింక్ ధ్రువపత్రాలను ఎంపీపీ రెడ్డెప్ప, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాగారెడ్డి, జెడ్పీటీసీ సుష్మకీర్తి తదితరులు పంపిణీ చేశారు. వైస్ ఎంపీపీలు జీడీ బాబు, అంజమ్మ, తహసీల్దార్ లోకేశ్వరరావు పాల్గొన్నారు.

సృజనాత్మకతతో విద్యాబోధన





పలమనేరు : శిక్షణలో మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి, కల్లూరు హైస్కూల్లో..

పలమనేరు: సాంకేతికతను అందిపుచ్చుకుని సృజనాత్మకంగా విద్యాబోధన చేస్తే పిల్లలు పాఠాలను ఆసక్తిగా వింటారని, ఈ దిశగా ఉపాధ్యాయులు ప్రయత్నించాలని పలమనేరు ఎంఈఓలు లీలారాణి, బాల సుబ్రమణ్యం సూచించారు. మండలంలోని ప్రభుత్వ ఉపాధ్యాయులకు మండల స్థాయి కాంప్లెక్స్, సబ్జెక్ట్ లెవెల్ శిక్షణ బుధవారం ముగిసింది. ఎంఈఓలు మాట్లాడారు. బోధన సామర్థ్యాలను టీచర్లు పెంచుకోవాలన్నారు. అలాగే ఈఎల్ఎఫ్ టీచింగ్ గురించి వివరించారు. రిసోర్స్ పర్సన్లు మునాఫ్, రజాక్, రమేష్, ఎతీష్, టీచర్లు పాల్గొన్నారు.

కల్లూరులో..

పులిచెర్ల(కల్లూరు): డిజిటల్ టెక్నాలజీతో విద్యాబోధనను విద్యార్థులు సులువుగా, త్వరితగతిన అర్థం చేసుకోవడానికి వీలుంటుందని ఎంఈఓ తాతయ్య అన్నారు. కల్లూరు జెడ్పీ హైస్కూల్లో బుధవారం పులిచెర్ల, రొంపిచెర్ల మండలాల్లోని ఉన్నత పాఠశాలల భౌతిక, రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు క్లస్టర్ రిసోర్స్ డిజిటల్ టెక్నాలజీతో విద్యాబోధనపై శిక్షణ ఇచ్చారు.

వర్గీకరణ జోలికి వస్తే సహించం



మాట్లాడుతున్న శంకరప్ప తదితరులు

పుంగనూరు: ఎస్సీ వర్గీకరణతో కులాన్ని విభజించాలని చూస్తే సహించేది లేదని దళిత నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం రాష్ట్ర దళిత సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శంకరప్ప, మాల మహానాడు నాయకులు రాజు, కృష్ణప్ప వేర్వేరుగా విలేకరుల సమావేశాలు నిర్వహించి మాట్లాడారు. బీసీవైపీ ఆవిర్భావ సమావేశంలో రిజర్వేషన్‌కు మద్దతు ఇస్తామని ప్రకటించడం సరికాదని ఆక్షేపించారు. ఎస్సీ వర్గీకరణ జోలికొస్తే రాష్ట్రంలో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో దళిత నాయకులు మంజు, గంగాధర్, కుమార్, గంగప్ప, విక్రమ్, నరసింహులు, అశోక్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

గంగవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ప్రభావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, సిబ్బంది రిజిస్టర్లు, వ్యాక్సినేషన్ గది, కాన్పుల గదులను పరిశీలించారు. ఆసుపత్రిలో రోజువారీ నిర్వహించే ఆరోగ్య కార్యక్రమాల గురించి వైద్యాధికారిని అడిగి తెలుసుకున్నారు. రోజువారీ ఓపీ సంఖ్య, రోగులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. మిషన్ ఇంద్రధనుస్సు కార్యక్రమంపై సలహాలు-సూచనలు ఇచ్చారు. అనంతరం కలగటూరులో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. వైద్యాధికారులు శ్రీనివాసులు, నారాయణస్వామి, జిల్లా ఎపిడమాలజిస్ట్ శ్రీవాణి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయాన్ని..

వి.కోట : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని బుధవారం జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం జగనన్నకు చెబుదాం, జగనన్న సురక్ష, వైఎస్సార్ గృహ నిర్మాణ పథకం, ఫీవర్ సర్వే, 28న మహిళలతో మొక్కలు నాటించడంపై సమీక్షించారు. పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీఓ వినోద, ఏఓ మహేష్ పాల్గొన్నారు.

ఘనంగా 'కార్గిల్ విజయ్ దివస్'

- మాజీ సైనికుడికి సన్మానం



మాజీ సైనికుడు ప్రభాకర్‌ను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు



కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటిస్తున్న విద్యార్థులు


సోమల: స్థానిక ఎస్‌కేవీన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ గంగాధరం నాయుడు అధ్యక్షతన నిర్వహించిన ఈ వేడుకల్లో సోమల వైస్ ఎంపీపీ, మాజీ సైనికుడు ప్రభాకర్‌ను సన్మానించారు. ప్రభాకర్ మాట్లాడుతూ..కార్గిల్ యుద్ధం భారత్–పాకిస్తాన్ మధ్య 1999లో కాశ్మీర్‌లోని కార్గిల్ జిల్లాలో, మరికొన్ని సరిహద్దుల మధ్య జరిగిందన్నారు. నియంత్రణ రేఖ దాటి పాకిస్థాన్ ఆక్రమించుకున్న ప్రదేశాలను భారత సైన్యం, వాయుసేన సహకారంతో తిరిగి స్వాధీనం చేసుకుందని, దీనికి గుర్తుగా ప్రతి ఏటా జూలై 26న కార్గిల్ విజయ్ దివస్‌గా జరుపుకుంటున్నట్టు విద్యార్థులకు వివరించారు. వాస్తవానికి కార్గిల్ వార్ జరిగిన నెలలోనే తాను ఉద్యోగ విరమణ చేయాల్సి ఉందని, అయితే యుద్ధం కారణంగా తన రిటైర్మెంట్ ఆర్మీ అధికారులు కొంతకాలం వాయిదా వేశారని, ఆ సమయంలో తాను ఫిరోజ్‌పూర్, వాఘా సరిహద్దుల్లో విధులు నిర్వర్తించినట్లు జ్ఞాపకాలు పంచుకున్నారు. కార్గిల్ వార్‌లో భారత సైనికులు వీరోచిత త్యాగాలను స్మరించారు.విద్యార్థులు ఆర్మీలో చేరి దేశసేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ జయరాం, అధ్యాపకులు బి.శివయ్య, గౌతమ్, రవీంద్రరెడ్డి, వెంకటరమణ నాయక్, సుధ, గీత, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

కార్గిల్ అమర జవాన్లకు శ్రద్ధాంజలి

పులిచెర్ల(కల్లూరు): కార్గిల్ యుద్ధంలో ప్రాణత్యాగాలు చేసిన అమరజవాన్లకు కల్లూరు లయన్స్ క్లబ్, వీఆర్ఆర్ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. కార్గిల్ విజయ్ దివస్ పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. లయన్స్ క్లబ్ జిల్లా క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ, కళాశాల కరస్పాండెంట్ సురేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం

- పీహెచ్‌సీ భవనం ప్రారంభోత్సవంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



బైరెడ్డిపల్లెలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రారెడ్డి

బైరెడ్డిపల్లె: పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, ఈ దిశగా ఆస్పత్రులను ఆధునీకరిస్తోందని, అలాగే ఫ్యామిలీ డాక్టర్‌తో ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందిస్తోందని రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, శాస్త్ర సాంకేతిక, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బుధవారం ఆయన మండలంలో పలు ప్రారంభోత్సవాలు చేశారు. నాడు–నేడు కింద రూ.151.07 లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.40 లక్షల చొప్పున నిర్మించిన బైరెడ్డిపల్లె–1, బైరెడ్డిపల్లె–2, గంగినాయనపల్లె సచివాలయాలు, రూ.21.80 లక్షల చొప్పున నిర్మించిన బైరెడ్డిపల్లె–2, దేవదొడ్డి రైతు భరోసా కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో చిత్తూరు ఎంపీ ఎన్.రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, డీసీసీబీ చైర్‌పర్సన్ మొగసాల రెడ్డెమ్మ, ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి, పీఆర్‌ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీసీసీబీ సీఈఓ మనోహర్‌గౌడు, డీపీఓ లక్ష్మి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, రాజంపేట వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి దయానంద గౌడు, తహసీల్దార్ కుమారస్వామి, ఎంపీడీఓ రాజేంద్రబాలాజి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ నిర్మాణానికి మంత్రి భూమిపూజ



సబ్‌స్టేషన్ శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వి.కోట: తోటకనుమ పంచాయతీలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ, దాదాపు 6 ఎకరాల స్థలంలో రూ 30 కోట్లతో 132/33 కే.వీ విద్యుత్ ఉపకేంద్రం నిర్మించనున్నట్టు చెప్పారు. ఇది పూర్తయితే వి.కోట, బైరెడ్డిపల్లి మండలాల్లో విద్యుత్ సమస్యను అధిగమించి రైతులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరాకు చేయడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, పీఎస్ నాగరాజు, మండల కన్వీనర్ బాలగురునాథ్, తోటకనుమ ఎంపీటీసీ హరి, సర్పంచ్ భాగ్యమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.